మీడియా ప్రతినిధులపై దాడి హేయమైన చర్య


పులివెందులలో ఇన్‌చార్జి ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

పులివెందుల టౌన్/రూరల్ : వేముల మండలంలో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్ చేసేందుకు వెళ్లిన సాక్షి రిపోర్టర్ రాజారెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, సాక్షి టీవీ కెమెరామెన్ రాములపై రాళ్లతో దాడి చేసి చొక్కాలు చింపడం హేయమైన చర్య అని పులివెందుల పాత్రికేయులు ఖండించారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్ నుంచి అంబకపల్లె రోడ్డులో ఉన్న ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జర్నలిస్టులపై దాడులు అమానుషం, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి, జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఇన్‌చార్జి ఆర్డీఓ చిన్నయ్యకు సీనియర్ పాత్రికేయులు చంద్రమోహన్‌రెడ్డి, ఓం ప్రకాష్, సురేంద్ర, కృష్ణకుమార్, మురళీ, రమేష్‌బాబు, రమణారెడ్డి, గంగిరెడ్డి, దామోదర్‌రెడ్డి, విశ్వనాథ్, హరి, జయరాంరెడ్డి, మహమ్మద్ ఆలీ, పుల్లారెడ్డిలతోపాటు పాత్రికేయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు శంకర్, సుబ్బారెడ్డి, కుమార్, గురువయ్య, మోహన్, కార్తీక్, రామకృష్ణ, రాము, ప్రసాద్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : సాక్షి జర్నలిస్టుల ప్రతినిధులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డిని వేంపల్లి ఏపీయూడబ్ల్యూజే మండల నాయకులు కోరారు. శుక్రవారం వేములలో సాక్షి జర్నలిస్టులపై దాడికి నిరసనగా వేంపల్లె మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ఎటువంటి స్వార్థం లేకుండా నిరంతరాయంగా కష్టపడి పనిచేస్తున్న వారిపై ఇలా దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు.

ప్రభుత్వాలు మారిన ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరాయంగా కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులపై మరోసారి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రఘునాథరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఏఎస్ఎల్ బాషా, బాలం జయచంద్ర, దివాకర్‌రెడ్డి, బాలం మనోహర్, చిన్న దస్తగిరిరెడ్డి, కేశవ ప్రతాప్‌రెడ్డి, శివకేశవరెడ్డి, బాలం గోపాల్, మారుతి ప్రసాద్, రాజశేఖర్, కృష్ణమోహన్, సుబ్బారెడ్డి, అమ్మతల్లి సుబ్బా రెడ్డి, నాగేష్, దొంతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : విధినిర్వహణలో వున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టాలని మండల పాత్రికేయ సంఘం కోరింది. శుక్రవారం స్థానిక తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డికి పాత్రికేయులు వినతిపత్రం అందించారు. వేములలో సాక్షి టీవీ జర్నలిస్టు శ్రీనివాస్, కెమరామెన్ రాము, సాక్షి విలేకరి రాజారెడ్డిలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు కోరారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయమని ఎర్రగుంట్ల మీడియా ప్రతినిధులు అన్నారు. శుక్రవారం తాహసీల్దార్ శోభన్‌బాబుకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వేముల మండలంలోని సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి మీడియ ప్రతినిధులపై అక్కడి టీడీపీ నాయకులు దాడులకు పాల్పడి గాయపరచడం బాధకరమన్నారు. విధుల నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ సభ్యులు వల్లెపు శ్రీనివాసులు, జర్నలిస్టులు రాంప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రమేష్, హబీబ్, శివకృష్ణ, రఘురాముడు, నారాయణ, ప్రవీన్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో నిజాముద్దీన్‌కు శుక్రవారం జమ్మలమడుగు జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రిపోర్టర్లపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నరసింహారెడ్డి, అబ్దుల్‌బషీర్, మహాబూబ్ హుస్సేన్, చిన్నికృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మీడియాపై దాడి చేయడం అమానుషం అని ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గెంటెం సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వేములలో మీడియాపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి చేయడం తగదన్నారు. వేముల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల సమక్షంలోనే సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దారుణం అని, ఈ దాడికి పాల్పడిని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వ భారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

జమ్మలమడుగు : కడప జిల్లాలోనే స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు శుక్రవారం స్థానిక ఐటీఐ సమీపంలో విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. రాయలసీమ కరువు ప్రాంతం కావడంతో చాలా మంది చదువుకున్నా ఉద్యోగావకాశాలు లేక ఇతర ప్రాంతాలకు పోతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

క్లుప్తంగా

గ్రామాల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ


గ్రామాల సుస్థిర అభివృద్ధిపై సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిపై పలు సూచనలు, సలహాలు అందించడంతోపాటు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఏపీఎం మంజునాథ్, మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలలో రెవెన్యూ సదస్సులు


సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులకు భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, వారి సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలో రైతులు వివిధ సమస్యలపై సదస్సులో రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీటీ నరేంద్ర, ఆర్ఐ గంగాధరరెడ్డి, సర్వేయర్ పార్వతి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

భానుకోటలో మాజీ సీఎస్ ప్రత్యేక పూజలు


భానుకోట క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామ సమీపంలో ఉన్న శ్రీభానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన సొంత గ్రామమైన చవ్వారిపల్లెకు చేరుకుని తండ్రి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని తండ్రి కొమ్మా ఈశ్వరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం శివభాస్కర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం : స్థానికంగా ఉన్న శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నూతన రథం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రధాన అర్చకులు హరిప్రసాద్ శర్మ స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, గణపతి, నారాయణ, నవగ్రహ, వాస్తు హోమాలు, నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.

టీసీఎస్ కంపెనీకి జేఎన్టీయూ విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో జెఎన్‌టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు టీసీఎస్ కంపెనీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో విద్యార్థులకు టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో సీఎస్ఈ విభాగం నుంచి 10 మంది, ఈసీఈ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని ఇరువురికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం స్కూటర్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటనలో ఇరువురు గాయపడ్డారు. తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరుకు ప్రయాణిస్తున్న లారీ గంగాదేవిపల్లెకు చెందిన మల్లికార్జున, రామచంద్రలు స్కూటర్‌పై ప్రయాణిస్తుండగా ఢీకొంది. ఈ ఘటనలో మల్లికార్జున కాలికి, రామచంద్ర తలకు గాయమైంది. ఇరువురిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు జరిగే బహిరంగ సభకు తరలిరండి


పోస్టర్లను విడుదల చేస్తున్న ముస్లిం పెద్దలు

కమలాపురం : కడప నగరంలోని జయరాజ్ గార్డన్‌లో ఈనెల 15వ తేదీన జమియత్ ఉలేమా హింద్ పర్యవేక్షణలో నిర్వహించనున్న బహిరంగ సభకు ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని ముస్లిం వక్తలు ముఫ్తి జావీద్ ఆలం ఖాస్మీ, ఖాజీ సయ్యద్ నాసీర్ హుసేనీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మస్జిద్–ఏ–అక్సాలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేసి మాట్లాడారు. దేశంలో నియంతృత్వానికి, మైనార్టీలపై అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడం కోసం దేశ వ్యాప్తంగా మూడు చోట్ల ఇలాంటి బహిరంగ సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే ఢిల్లీ, పాట్నాలలో సభలు ముగిసాయన్నారు. చివరిగా కడపలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు హజ్రత్ మౌలానా సయ్యిద్ అర్షద్ మదని హాజరు కానున్నారని, ప్రతి ముస్లిం సోదరుడు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. ఆదివారం 2.30 గంటలకు జామియా మస్జిద్ నుంచి వాహనాలు బయలు దేరుతాయన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చక్రాయపేట : మండలంలోని గండిక్షేత్రంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం నిర్వహించామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, నివేదన అనంతరం మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. హనుమత్ వ్రతంలో భాగంగా ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజా స్వాముల నేతృత్వంలో అనుజ్ఞ, విష్వక్షేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షా బంధన ధారణ, పంపానది కలశ స్థాపన, వీరాంజనేయస్వామి కలశ స్థాపన, రిత్విక్ వరణం, హోమం, పూర్ణాహుతి గోష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తిరుమలకు చెందిన పండితులు బీవీ రామానుజాచార్యులు వారి శిష్య బృందంచే నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్ వెంకటస్వామి, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన


పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథ్

కమలాపురం : సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ పరిశీలించారు. ఈనెల 14న స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో సాగునీటి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఎన్నికల అధికారి సిబ్బంది కలసి ఎన్నికల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. సభ్యులందరూ 8.30 హాజరు కావాలన్నారు. సభ్యులందరూ ప్రభుత్వ గుర్తింపు కలిగిన కార్డు తీసుకువచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 9 గంటలకు సాగునీటి సంఘాల సభ్యుల ఎన్నిక జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ల ఎన్నిక జరుగుతుందన్నారు. సహాయ ఎన్నికల అధికారి సరస్వతి, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి


బాల్య వివాహాల రద్దుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వీరపునాయునిపల్లె : గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళి తెలిపారు. గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండవ రోజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 సంవత్సరాల వరకు అన్ని రకాల సేవలు అందిస్తారన్నారు. ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం బాల్యవివాహాల రద్దుకు కృషి చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, వెలుగు ఏపీఎం బాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కదిరి సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి


పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పులివెందుల లాయర్లు

పులివెందుల రూరల్ : సత్యసాయి జిల్లా కదిరిలో పనిచేస్తున్న సీఐ నారాయణరెడ్డి, రామకృష్ణ అనే వ్యక్తిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను పులివెందుల లాయర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో లాయర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 12వ తేదీన లాయర్ గజేంద్ర క్లయింట్‌కు ఫోర్జరీ చేసిన నోటీసు పంపించాడని సీఐ నారాయణరెడ్డి లాయర్‌కు ఫోన్‌చేసి బెదిరించారన్నారు. ఫోర్జరీ విషయం నాకు తెలియదని లాయర్ గజేంద్ర సిఐకి చెప్పినా సీఐ లాయర్ గజేంద్రపై కేసు నమోదు చేస్తున్నామని బెదిరించారన్నారు. కదిరి సీఐ నారాయణరెడ్డి, రామకృష్ణలపై కేసు నమోదు చేయాలని పులివెందుల డీఎస్పీకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పులివెందుల లాయర్లు నరసింహారెడ్డి, కిశోర్, ప్రతాప్‌రెడ్డి, గజేంద్ర, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాతకు అండగా’ తరలి వెళ్లిన నాయకులు


కడప కలెక్టరేట్‌కు వెళుతున్న పులివెందుల వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎర్రగుంట్ల నుంచి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన అన్నదాతకు వైఎస్సార్‌సీపీ అండగా అనే పోరు బాట చేపట్టారు. చంద్రబాబు సర్కార్ మోసాలపై అన్నదాతల నిరసనకు వైఎస్సార్‌సీపీ బాసటగా నిలిచి శుక్రవారం కడప కలెక్టరేట్ కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు బయలుదేరారు. పులివెందుల భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఆలయాల చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు నూరుల్లా, కౌన్సిలర్లు కోడి రమణ, రజియా, లక్ష్మీభార్గవి, లక్ష్మీప్రసన్న, షాహిదా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో బయలుదేరి వెళ్లారు.

కమలాపురంలో..

కమలాపురం : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో జరుగుతున్న అన్నదాతకు అండగా కార్యక్రమానికి స్థానిక నాయకులు తరలి వెళ్లారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పర్యవేక్షణలో కమలాపురం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కడప కలెక్టరేట్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి హామీలు నెరవేర్చలేదని వారన్నారు. అన్నదాత సుఖీభవ ఎమైందని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని మండల నాయకులు హెచ్చరించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో ఉన్న రైతులను ఆదుకోవడంలో ఈ కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందని, మోసపూరిత హామీలను రైతులకు చెప్పి దొడ్డిదారిన అధికారం పొంది ఇప్పుడు రైతులను తుంగలోకి తొక్కే విధంగా ఈ చంద్రబాబు సర్కార్ తయారైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలసి అన్నదాతలకు అండగా కార్యక్రమానికి సంఘీభావంగా కడపకు బయలుదేరారు. ఇప్పటికైన రైతులు కూటమి సర్కార్ చేస్తున్న మోసాలను గమనించాలని సూచించారు. వైఎస్సార్ ప్రభుత్వ హయంలో రైతులకు సకాలంలో విత్తనాలు, రైతు భరోసా, సబ్సిడీ, పంట నష్టపరిహారాలు లభించాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పొన్న శ్రీను, పార్టీ నాయకులు జయరామకృష్ణారెడ్డి, గంగా శివారెడ్డి, ముద్దనూరు శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

చింతకొమ్మదిన్నె : గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయభాస్కరరావు, ప్రత్యేక అధికారి రాఘవ పాల్గొని శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుల్లాయిబాబు, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, ఇతర మండలస్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : ఎరువుల దుకాణంలో ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఎరువుల దుకాణాలలో ఆమె రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులకు సంబంధించిన వివరాలను రికార్డులలో పొందుపరచాలని, రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలన్నారు. అధికారులు చెప్పే సలహాలు, సూచనలు పాటిస్తే రైతులు తమ సాగుచేసిన పంటలలో మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణాల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వల్లూరు (చెన్నూరు) : గ్రామాలలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సరస్వతి తెలిపారు. శుక్రవారం ఉప్పరపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి అందుతున్న వినతులలో ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించిన వినతులే అందుతున్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.అనంతరం రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, వీఆర్వో వెంకటసుబ్బయ్య, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధికారులపై ఒత్తిడి


పులివెందుల తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం అచ్చివెళ్లి, ఎర్రంరెడ్డిపల్లె గ్రామాల నీటి సంఘాలకు సంబంధించి పోటీ చేసే క్రమంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటి పన్ను చెల్లించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను చెల్లించకుండా, తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లనీయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. కాగా టీడీపీ వర్గీయులు నీటి పన్నులు చెల్లించేందుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

తొండూరు : సాగునీటి సంఘాల ఎన్నికల విషయంలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంది. శుక్రవారం ఉదయం 9గంటలనుంచే స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఎవరినీ లోపలికి వెళ్లనీయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. టీడీపీ నాయకులు బీటెక్ రవితోపాటు తొండూరు మండల టీడీపీ నాయకులు అందరూ కలిసి కట్టుగా పెద్ద ఎత్తున గుమికూడి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసే రైతులను అడ్డుకున్నారు.

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలంలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేయాలనుకున్న అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేశారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు వెచ్చించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

లింగాల : గ్రామాల అభివృద్ధికి విడుదల చేసిన నిధులను బాధ్యతగా వెచ్చించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం లింగాల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ నిధులను ఖర్చు చేయాలన్నారు. అదేవిధంగా బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన, విద్యా హక్కు చట్టాలను గ్రామాల్లో అమలుపరిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


మట్కా బీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఎస్‌కే రోషన్

కమలాపురం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ హెచ్చరించారు. మండలంలోని మట్కా బీటర్లకు సీఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై ఏ ఒక్కరూ మట్కా రాయడం కానీ, ఆడటం కానీ జరిగితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలు, మట్కాకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తన సెల్ నంబరు 9121100529కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తెలిపిన వారి వివరాలను గోప్యంగా వుంచి తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు.